క్లుప్తంగా

అలరించిన అష్టావధానం



కవులను సన్మానిస్తున్న నిర్వాహకులు

చెన్నూర్: పట్టణంలో నిర్వహించిన అష్టావధానం సభికులను అలరించింది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కిష్టంపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ పట్వర్ధన్ స్వగృహంలో గణిత శాస్త్ర ఉపాధ్యాయులు చేపూరి రామారావు ఆధ్వర్యంలో కవి సమ్మేళనం, అష్టావధానం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల, ఆసిఫాబాద్, వరంగల్, కరీంనగర్, హనుమకొండ పట్టణాల నుంచి కవులు, కవయిత్రిలు, పండితులు, తెలుగు భాషా అభిమానులు తరలివచ్చారు. కవితలను వినిపించారు. అనంతరం నిర్వాహకులు కవులు, పండితులను సన్మానించారు. కార్యక్రమంలో వేదాంతం సురేశ్, జక్కెపల్లి నాగేశ్వర్‌రావు, మహావాది సుభాష్, కొమ్మెర రాంమూర్తి, కరుణాకర్ స్వామి, భూపతి సంతోశ్, హైమవతి, వామన్‌రావు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న చైతన్య

చెన్నూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని డిగ్రీ పూర్తిచేసిన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని శాతవాహన జేఏసీ చైర్మన్ చెన్నమల్ల చైతన్య పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట రామ్‌యాదవ్, నైతం మహేశ్, బోడకుంట రమేశ్, గడ్డం ప్రశాంత్, కన్నం గణేశ్, జిట్టవేన వంశీ, బండారి శివ, అట్టెం వరుణ్‌తేజ్, ఎద్దుల సిద్ధు, నాగేంద్రప్రసాద్, మహేందర్ ఉన్నారు.

కార్మికులకు బహుమతులు ఇవ్వాలి

నస్పూర్: దసరా సందర్భంగా సింగరేణి యాజమాన్యం కార్మికులకు భోజనాలు పెట్టాలని నిర్ణయించిందని, భోజనాలకు బదులుగా బహుమతులు అందజేయాలని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, ఏరియా బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో డీఎంఎఫ్‌టీ నిధులతో గురువారం మధ్యాహ్నం 12గంటలకు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గడ్డం వివేక్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ శంకుస్థాపన చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

దిష్టిబొమ్మ దహనం



దహనం చేస్తున్న వివేక్ యువసేన నాయకులు

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్):చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై ప్రభుత్వ మాజీ విప్ సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ వివేక్ యువసేన ఆధ్వర్యంలో రామకృష్ణాపూర్‌లోని బీ జోన్ రాజీవ్‌చౌక్ సెంటర్లో బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో వివేక్ యువసేన, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండాలి



ప్రెస్‌క్లబ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కోట్నాక తిరుపతి

దండేపల్లి: పాత్రికేయులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. దండేపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌క్లబ్ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, ఎస్సై ఉదయ్‌కిరణ్, మార్కెట్‌కమిటీ చైర్మన్ ప్రేమ్‌చంద్, ఆర్‌జీపీఎస్ జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుప్పుమంటున్న గుడుంబా

- గ్రామాల్లో ఏరులై పారుతున్న నాటుసారా
- 'మామూలు'గా వ్యవహరిస్తున్న ఎక్సైజ్ అధికారులు



నెన్నెల మండలంలో బెల్లం పానకం పారబోస్తున్న బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దీన్, ఎస్సైలు (ఫైల్)

బెల్లంపల్లిరూరల్: పల్లెల్లో గుడుంబా రాజ్యమేలుతోంది. ఏరులై పారుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. గ్రామీణుల కుటుంబాల్లో చిచ్చురేపుతూ, కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న నాటుసారా తయారీని అరికట్టడంలో ఎక్సైజ్ అధికారులు విఫలమవుతున్నారు. గ్రామాలు, మారుమూల ప్రాంతాలు, తండాల్లో గుట్టుచప్పుడు కాకుండా నాటుసారా తయారీ జరుగుతున్నా సంబంధిత అధికార యంత్రాంగం 'మామూలు'గా వ్యవహరిస్తోంది.

నియోజకవర్గ వ్యాప్తంగా.....

బెల్లంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా బెల్లంపల్లి, నెన్నెల, కన్నెపల్లి, భీమిని, కాసిపేట, తాండూర్, వేమనపల్లి మండలాల పరిధిలోని గ్రామాల్లో, తండాల్లో విచ్చలవిడిగా గుడుంబా తయారీ, అమ్మకాలు జోరుగా సాగుతున్నాయనేది బహిరంగ రహస్యమే. అధిక ధరలు పెట్టి మద్యం కొని తాగలేని పరిస్థితుల్లో ఉన్న నిరుపేదలు, మధ్యతరగతి వారు ఈ గుడుంబా వైపు మొగ్గు చూపుతున్నారు. క్రమంగా వారు బానిసలవుతుండడంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. దీనిని తాగిన వారి ఆరోగ్యం క్రమంగా క్షీణించి శరీరంలోని అవయవాలు ఒక్కొక్కటిగా దెబ్బతింటూ, పూర్తిగా నాశనమై మృత్యువాత పడుతున్నారు.

జోరుగా దందా..

గ్రామాల్లో ఈ కల్తీ సారా తయారీ దందా అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది. ఎక్సైజ్ అధికారులు తరచూ దాడులు చేస్తూ గుడుంబా తయారీ దారులను హెచ్చరిస్తూ కేసులు నమోదు చేస్తున్నప్పటికీ 'దందా'ను అరికట్టేంత స్థాయిలో ఆ చర్యలు లేకపోవడంతో కల్తీ దందా ఆగకుండా సాగుతోంది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా, ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుతున్న కల్తీ నాటుసారాపై అధికారులు ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు, పోలీసులు ఆ దిశగా దృష్టి సారించి కల్తీసారా తయారీని పూర్తిగా నిర్మూలించే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇటీవల ఘటనలు...

- సెప్టెంబర్ 28న నెన్నెల మండలం శ్రావణపల్లిలో పోలీసులు 20లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు.
- సెప్టెంబర్ 22న నెన్నెల మండలం చిన్న లంబాడి తండాలో 15లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేశారు.
- ఆగస్టు 4న నెన్నెల మండలం పెద్ద లంబాడి తండా గ్రామ శివారులో ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న 10లీటర్ల గుడుంబాను పట్టుకుని ఒకరిపై కేసు నమోదు చేశారు.
- రెండు నెలల క్రితం వేమనపల్లి మండలం బుయ్యారం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో 2వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు.

నిరంతరం దాడులు

గుడుంబాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘాతో గ్రామాల్లో పగలు, రాత్రి దాడులు నిర్వహిస్తున్నాం. దాడులు చేపట్టి దాదాపు 280మందికి పైగా మందిని బైండోవర్ చేయడంతో పాటు 40వాహనాలు స్వాధీనం చేసుకున్నాం. గుడుంబా, నాటు సారాను అరికట్టడంలో నిర్లక్ష్యం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. గుడుంబాను పూర్తిగా నిర్మూలించడానికి కార్యచరణ చేపడుతున్నాం. ప్రజలు కూడా తమవంతు సహాయ సహకారాలు అందించాలి.

– జి.ఇంద్రప్రసాద్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, బెల్లంపల్లి

నేరాల కట్టడికే 'కమ్యూనిటీ కాంటాక్ట్'



అవగాహన కల్పిస్తున్న సీఐ అఫ్జలొద్దీన్

నెన్నెల: నేరాల కట్టడి, శాంతి భద్రతాల పరిరక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దీన్ అన్నారు. మండలంలోని నార్వాయిపేటలో బుధవారం సోదాలు చేసి ధృవపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో యువత గంజాయి, నాటుసారా లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి విక్రయించినా, సేవించినా, పండించినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. గ్రామాల్లో అనుమానిత కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, హెల్మెట్ ధరించకపోవడం వంటి కారణాలతో విలువైన ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని చెప్పారు. చోరీలు, అసాంఘిక కార్యక్రమాలు నియంత్రించడంలో ఇవి ముఖ్యపాత్ర పోషిస్తాయని అవగాహన కల్పించారు. సైబర్ క్రైం, డయల్100, షీ టీం, మోటర్ వెహికిల్ చట్టం, మూఢనమ్మకాల గురించి గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో నెన్నెల, తాళ్లగురిజాల, బెల్లంపల్లి టూటౌన్ ఎస్సైలు ప్రసాద్, రమేష్, మహేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన



మాట్లాడుతున్న రమేశ్

బెల్లంపల్లి: వ్యవసాయానికి పనికొచ్చే నిషేధిత సాగు భూములను కొందరు రియల్టర్లు దర్జాగా ప్లాట్లుగా మారుస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి.రమేశ్ పేర్కొన్నారు. మండలంలోని ఆకెనపల్లి శివారు సర్వే నంబర్ 3పైకి లో ప్రభుత్వ అసైన్‌మెంట్ భూమిలో పీవోటీ, వాల్టా చట్టానికి వ్యతిరేకంగా ప్లాట్లు చేసి విక్రయాలు సాగిస్తున్నారని ఆరోపించారు. బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం పార్టీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ జోత్స్నకు వినతిపత్రం అందజేశారు. నియమ నిబంధనలు ఏమాత్రం పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా సాగిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని వెంటనే ఆపాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కొప్పెల్లి నవీన్, నాయకులు నర్సింగ్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు దీపారాణి, ఉపాధ్యక్షురాలు స్రవంతి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

నారాయణ ఆసుపత్రి ప్రారంభం



ప్రారంభిస్తున్న డాక్టర్ కోటేశ్వర్‌రావు, విశ్వేశ్వర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని గౌతమినగర్‌లో గల సొంత భవనంలో నారాయణ ఆసుపత్రిని డాక్టర్ కోటేశ్వర్‌రావు, విశ్వేశ్వర్ రావులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంచిర్యాలలోనే మొట్టమొదటి మహిళ సర్జన్‌గా వైద్యరంగంలో విశిష్ట సేవలందిస్తున్న డాక్టర్ కళావతి గౌతమినగర్‌లో ఆసుపత్రిని ప్రారంభించడం సంతోషకరమన్నారు. హైదరాబాద్‌లోని కార్పొరేట్ స్థాయిలో మంచిర్యాలలో ఆధునిక టెక్నాలజీతో ఆసుపత్రిని ప్రారంభించారని తెలిపారు. అనంతరం డాక్టర్ కళావతి మాట్లాడుతూ.. సాధారణ ప్రజలకు తక్కువ ధరలో వైద్యం అందరికీ అందాలనే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యులు మల్లేశ్, సుఖభోగి వెంకటేశ్వర్లు, మూర్తి, సల్మాన్ రాజ్, రాంబాబు, కుమార్, నూతన రవి, రాజ్‌కిరణ్, అంగుమంచి రాణి, స్వరూప రాణి, మెడికల్ అసిస్టెంట్ తొగరి సుధాకర్, మేనేజింగ్ డైరెక్టర్ కాసర్ల యోహాన్, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం బీజేపీదే..

- జిల్లా అధ్యక్షుడు రఘునాథ్



వేంపల్లిలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న రఘునాథ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. హాజీపూర్ మండలం వేంపల్లిలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో గడపగడపకూ బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. అనంతరం రఘునాథ్ మాట్లాడుతూ.. దేశంలో అభివృద్ధి, సుపరిపాలన జరగాలంటే ప్రధాని నరేంద్రమోడీకి మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు స్వామిరెడ్డి, ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోటపలుకుల తిరుపతి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్‌రెడ్డి, మండల నాయకులు మల్లేశ్, ప్రశాంత్, సతీశ్, ప్రమోద్, శ్రీనివాస్, ప్రవీణ్, నగేశ్ పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని అంగడి బజార్‌లో బుధవారం బీజేపీ నాయకులు సభ్యత్వ నమోదు నిర్వహించారు. వార్డుల్లోని దుకాణాల్లో తిరుగుతూ పలువురితో సభ్యత్వం చేపించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రఘునాథరావు, పట్టణాధ్యక్షుడు హరిగోపాల్, నాయకులు తిరుపతి, రమేశ్, ప్రభాకర్, వెంకటరమణ, రవి, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ తపాలా దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ అధికారులు, సిబ్బంది

బెల్లంపల్లి: ప్రపంచ తపాలా దినోత్సవాన్ని బుధవారం బెల్లంపల్లిలో ఘనంగా నిర్వహించారు. తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఫిట్ పోస్టు -ఫిట్ ఇండియా ర్యాలీ'ని నిర్వహించారు. బజారు ఏరియా పుర వీధుల మీదుగా పోస్టాఫీసు వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా పోస్టల్ పథకాలకు సంబంధించిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీలో పోస్టల్ సిబ్బంది ముందుకు సాగారు. వివిధ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నమ్మకానికి మారుపేరుగా నిలుస్తున్న తపాలా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పోస్టాఫీసు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ విక్రమ్, పోస్టు మాస్టర్ సుదమల్ల వెంకన్న, మెయిల్ ఓవర్సీస్ పోస్టుమ్యాన్‌లు, సబ్ డివిజన్ పరిధిలోని బ్రాంచ్ పోస్టుమాస్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కాన్షీరాం వర్ధంతి

పాతమంచిర్యాల: బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షీరాం వర్ధంతిని జిల్లా కేంద్రంలోని చార్వాక భవన్‌లో బీఎస్పీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి కాదాసి రవీందర్ మాట్లాడుతూ.. కాన్షీరాం బహుజన రాజ్యాధికార సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు ములకల్ల రాజేంద్రప్రసాద్, హాజీపూర్, నస్పూర్, తాండూర్ మండలాల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మా.. సల్లంగా చూడమ్మా



అంగ్రాజ్‌పల్లిలో దుర్గామాత వద్ద కుంకుమ పూజలు



ఆర్‌కే 7 గనిపై దుర్గామాతను దర్శించుకుంటున్న జీఎం దంపతులు

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్)/నస్పూర్/చెన్నూర్‌రూరల్/జన్నారం: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మా మము సల్లంగా చూడు అంటూ భక్తులు వేడుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు. కుంకుమపూజలు, హోమాలు చేశారు. పలు చోట్ల మండపాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మందమర్రి జీఎం దేవేందర్, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్కేపీ సీహెచ్‌పీలో చండీహోమంలో పాల్గొన్న జీఎం



ఎస్ఆర్పీ 3 గనిపై పూజలు నిర్వహిస్తున్న దివాకర్‌రావు



జన్నారం: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న అంబేద్కర్‌సంఘం నాయకులు

దండేపల్లి: సమస్య చెప్పేందుకు జీపీ కార్యాలయానికి వెళ్లిన వ్యక్తిని దుర్భాషలాడిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు బాపన్న, నాయకులు దయాకర్, బాధిత వ్యక్తి జైలు డిమాండ్ చేశారు. దండేపల్లి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మాట్లాడారు. మండలంలోని గుడిరేవు గ్రామానికి చెందిన పిరంగి జైలు సమస్య చెప్పేందుకు మంగళవారం పంచాయతీ కార్యాలయానికి వెళ్లగా, కార్యదర్శి శ్రీనివాస్ అతడిని బయటకు వెళ్లాలని వారించడంతో పాటు, ఎవరి అనుమతి తీసుకొని లోపలికి వచ్చావ్, గెట్‌ఔట్ అంటూ దుర్భాషలాడి అవమానపరిచాడని, అతడిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యదర్శిపై పోలీస్‌స్టేషన్‌లో, ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కార్యదర్శి శ్రీనివాస్‌ను వివరణ కోరగా జీపీ కార్యాలయంలో మల్టీపర్పస్ వర్కర్ల సమస్యపై చర్చిస్తుండగా, జైలు లోపలికి వచ్చాడు. బయటికి వెళ్లి తర్వాత రమ్మని చెప్పాను తప్పా.. అతడిని ఎలాంటి దుర్భాషలాడలేదు అని చెప్పారు.

రోడ్డు ఇలా.. నడిచేదెలా?



రోడ్డు వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

వేమనపల్లి: మోకాలు లోతు బురదతో ఈ రోడ్డు వెంట నడవడం కష్టంగా ఉందని మండల కేంద్రంలోని బొగుడగూడెం వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బురదమయంగా ఉన్న రోడ్డు వద్దకు వెళ్లి బుధవారం నిరసనకు దిగారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులకు ఇదే ప్రధానమైన రోడ్డు అని తెలిపారు. డుబ్బులవాడ వరకు సీసీ రోడ్డు నిర్మించి, సుమారు వందమీటర్ల పొడవున్న ఈ రోడ్డును పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్య పరిష్కరించాలని కోరారు.

కంటి వైద్య శిబిరం


బెల్లంపల్లి: మున్సిపాలిటీలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వరల్డ్ సైట్ డే ను పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పెద్దనపల్లి బస్తీలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురికి కళ్ల పరీక్షలు చేశారు. ప్రతి ఒక్కరూ నేత్రాలను భద్రంగా కాపాడుకోవాలని, కంటి దోషాలు ఉన్నా వెంటనే చికిత్స తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, లయన్స్ క్లబ్ నిర్వాహకుడు వినోద్ కుమార్, సభ్యులు ప్రభాకర్, లత, మోహన్, శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

చెన్నూర్: మున్సిపాలిటీలో విధులు నిర్వర్తించే పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అర్చన రాంలాల్ గిల్డా చేతుల మీదుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నవాజుద్దీన్, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు జగన్నాథుల శ్రీను, తుమ్మ రమేశ్, ఆయబ్, మేడ సురేశ్‌రెడ్డి, వెంకటనర్సయ్య, ఆరీఫ్, వెంకటరాజం, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

దాండియా అదుర్స్




మంచిర్యాలఅర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని హిందీ హైస్కూల్ గ్రౌండ్‌లో మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో గర్బా నిర్వహిస్తున్నారు. అమ్మవారి చిత్రపటం వద్ద మహిళలు, పురుషులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అనంతరం గుజరాత్, రాజస్థాన్‌లకు చెందిన మహిళలు చోళీ, గాగ్రా దుస్తులు ధరించి దాండియా నృత్యాలు చేస్తూ ఆకర్షణగా నిలుస్తున్నారు. కోలాటం ఆడుతున్నారు.